క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

చీమకుర్తి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చీమకుర్తి మండలంలోని గోనుగుంట జిల్లా పరిషత్ హైస్కూలు, సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలులో పదో తరగతి చదువుతున్న ఇంగ్లిష్, తెలుగు మీడియం విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. యూటీఎఫ్‌కు సంబంధించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను క్లబ్ అధ్యక్షుడు గొల్లపూడి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మార్తల తిరుపతిరెడ్డి సహకారంతో అందించారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.

13న నాలుగు మండలాల స్థాయి ముగ్గుల పోటీలు

నాగులుప్పలపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా ఉప్పుగుండూరు వాసవీ క్లబ్, సంతూర్ వారి సౌజన్యంతో నాగులుప్పలపాడు, చిన్నగంజాం, కొరిశపాడు, ఇంకొల్లు మండలాల స్థాయి ముగ్గులు పోటీలు నిర్వహించనున్నట్లు వాసవీ క్లబ్ ప్రతినిధి కొంజేటి వెంకట సురేష్ బాబు తెలిపారు. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఉప్పుగుండూరు గ్రామంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రిఫ్రిజిరేటర్, ఎలక్ట్రికల్ గ్రైండర్, 3 జార్ మిక్సీ, ప్రెజర్ కుక్కర్ అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 99852 68422 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దేశానికి ప్రమాదకరంగా మారిన బీజేపీ

ఒంగోలు టౌన్: దేశానికి బీజేపీ ప్రమాదకరంగా మారిందని, మత విద్వేషాలు తప్ప ఆ పార్టీకి మరో అజెండా ఏమీ లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన సీపీఎం ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆర్థిక మాంద్యం ప్రభావం నుంచి గట్టెక్కించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదన్నారు. దేశంలో సంపదంతా అంబానీ, అదానీల జేబుల్లోకి పోతోందని ఆరోపించారు. నిరుద్యోగం 7 నుంచి 9 శాతానికి పెరిగిందని తెలిపారు. ప్లీనరీలో జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు పూనాటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో రేపు సంక్రాంతి సంబరాలు

ఒంగోలు సబర్బన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈ నెల 13వ తేదీ సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు కార్యాలయ ప్రాంగణంలో మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. నగర పాలక సంస్థకు చెందిన ఇండోర్, అవుట్ డోర్ సిబ్బందితో పాటు మెప్మా సిబ్బంది, మెప్మా గ్రూపుల మహిళలు, వార్డు సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు విధిగా హాజరు కావాలని కమిషనర్ కోరారు. ఒంగోలు నగర డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నగర ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సచివాలయం సిబ్బందికి నూతన వస్త్రాల అందజేత



సచివాలయ సిబ్బందికి నూతన వస్త్రాలు అందిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు

చీమకుర్తి: మాజీ ఎంపీపీ మేదరమెట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బూదవాడ సచివాలయం సిబ్బందికి బుధవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. సచివాలయాల వ్యవస్థ ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సచివాలయం సిబ్బందితో పాటు పారిశుధ్య కార్మికులకు దుస్తులు, వంట నూనెలు, సబ్బులను ఆయన అందించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించి పారదర్శకంగా సేవలందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కర్లపూడి సత్యం, దుద్దుకూరి బ్రహ్మయ్య, గూడూరి ఆంజనేయులు, స్థానికులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేద్దాం

- సమస్యలన్నీ పరిష్కరిద్దాం
- గుండ్లాపల్లి సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



గుండ్లాపల్లి సచివాలయంలో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, పార్టీ నాయకులు

మద్దిపాడు: ప్రజా సమస్యలన్నీ పరిష్కరించేందుకు పెండింగ్ పనులన్నీ పూర్తి చేద్దామని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులతో అన్నారు. మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై మండలంలోని గుండ్లాపల్లి సచివాలయంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అప్రమత్తంగా మెలుగుతూ గడపగడప కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకూ గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించారు. ఈ క్రమంలో సచివాలయం నుంచి ఎన్ని అర్జీలను పరిష్కరించగలరనే విషయమై సచివాలయ సిబ్బందితో చర్చించారు. అపరిష్కృతంగా మిగిలిన ఇంటి స్థలాల సమస్యను ప్రభుత్వానికి నివేదించి ఇళ్ల స్థలాలు ఆగిపోయిన వారికి త్వరలో ఇప్పించే కార్యక్రమం చేపడతామన్నారు. సచివాలయానికి వచ్చే వారికి వీలైనంత త్వరగా పనులు చేసి పంపించాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి మద్దతును కూడగట్టుకోవాలని పార్టీ నాయకులకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని తెలిపారు. మంగళవారం ఎస్సీకాలనీలో పలువురు ఇంటి స్థలాల సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని, ఆ సమస్యను పరిష్కరించడానికి శక్తివంచన లేకుండా తాను ప్రయత్నిస్తానని అన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు తలెత్తుతుంటాయని, వాటిని అధిగమిస్తూ ప్రజల అభ్యున్నతికి పాటు పడే దిశగా అడుగులు వేద్దామని పార్టీ నాయకులకు సూచించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రి చేసుకోవడమే మన అజెండాగా ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు పలువురు మాట్లాడుతూ సచివాలయ సిబ్బందిని అభినందిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర వహించాలని సూచించారు. మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన పల్లకి సత్యన్నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, ఇతర నాయకులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జెడ్పీటీసీ తేళ్ల భాగ్యలక్ష్మిపుల్లారావు, పార్టీ నాయకులు గట్టినేని అయ్యన్న, మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి, నర్రా సురేష్, రావిపాటి రమేష్, బత్తుల శ్రీనివాసరావు, షేక్ బాబు, లింగా రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లకి పద్మ, గ్రామ సర్పంచ్ కొప్పోలు ఆంజనేయులు, జవ్వాజి లక్ష్మీనారాయణరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



ఒంగోలులో ఎమ్మెల్యే టీజేఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎమ్మెల్యే టీజేఆర్‌ను కలిసిన ఒమ్మెవరం గ్రామస్తులు...

చీమకుర్తి: నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ, బీసీ నాయకులు బుధవారం ఒంగోలులోని ఎమ్మెల్యే టీజేఆర్ కార్యాలయంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో విభేదాలు లేకుండా కలిసికట్టుగా పనిచేస్తామని, రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు గ్రామంలో తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యేకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమలపు కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా బుధవారం మండలంలోని కూనంనేనివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ పమిడి మునలయ్య వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ మునలయ్య సర్పంచ్‌గా ఉన్న రోజుల్లో గ్రామాభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమని గుర్తు చేశారు. తండ్రి వర్ధంతి సందర్భంగా క్రమం తప్పకుండా పమిడి వెంకటేశ్వర్లు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, ఎంఈవో టీ రవి, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కౌన్సిలర్ బీమన వెంకట్రావు, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, బొడ్డు కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకులు విరివిగా రుణాలివ్వాలి

- ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రోత్సహించాలి
- బ్యాంకర్ల సమావేశంలో ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, సీఎల్‌డీఎం యుగంధర్‌రెడ్డి, అధికారులు

ఒంగోలు సబర్బన్: పట్టణ పేదలకు బ్యాంకులు విరివిగా రుణాలు అందజేసి వారి ఆర్థిక ఎదుగుదలకు సాయపడాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు బ్యాంకు అధికారులకు సూచించారు. స్థానిక కమిషనర్ చాంబర్‌లో బుధవారం బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. చీఫ్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కే యుగంధర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు బ్యాంకర్లు ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. ఏపీ టిడ్కో రుణాలను దరఖాస్తు చేసుకున్న అందిరికీ అందించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం టిడ్కో ఇళ్లు 4,128 మంజూరయ్యాయన్నారు. వాటిలో 1,584 మంది టిడ్కో ఇళ్ల నిర్మాణానికి బ్యాంకులు రుణాలు అందించాలని దరఖాస్తు చేసుకున్నట్లు కమిషనర్ వివరించారు. వాటిలో 416 మందికి రుణాలు మంజూరు చేశారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మిగిలిన 1,168 మంది కూడా రుణాలు తీసుకునేందుకు అర్హులేనన్నారు. వీళ్లందరికీ బ్యాంకర్లు రుణాలు మంజూరు చేసి టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయడానికి దోహదపడాలని బ్యాంకు మేనేజర్లను కమిషనర్ కోరారు. అదేవిధంగా ఆరో విడత జగనన్న తోడు పథకానికి సంబంధించి కూడా స్వయం ఉపాధి పొందేవారికి అందజేసి ప్రోత్సహించాలన్నారు. వీటితో పాటు పీఎం స్వనిధి రుణాలు, జగనన్న కాలనీల నిర్మాణాలకు రుణాలు కూడా విరివిగా మంజూరు చేయాలని సూచించారు. ఒంగోలు నగరంలోని బ్యాంకులు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అందించిన రుణాల పురోగతి గురించి బ్యాంకర్లతో చర్చించారు. ఈ సందర్భంగా చీఫ్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్(సీఎల్‌డీఎం) కే యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి బ్యాంకు మేనేజర్‌తో ముఖాముఖి నిర్వహించి రుణాల పురోగతి పెంచేవిధంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఆయా బ్యాంకులు రుణాల లక్ష్యాలను చేరుకునే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాల విషయంలో బ్యాంకర్లకు లక్ష్యాలు అధిగమించే విధంగా సూచిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో కమిషనర్, సీఎల్‌డీఎంతో పాటు మెప్మా డీసీహెచ్ కొండయ్య, పీవో సూర్యప్రతాప్, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

సంక్రాంతి సందడిని తలపిస్తున్న క్రికెట్ పోటీలు



టోర్నమెంట్‌లో తలపడుతున్న సీఎస్‌కే 11 ఇస్లాంపేట, డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్ జట్లు

ఒంగోలు: స్థానిక డీఆర్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభమైన రామిరెడ్డి శ్రీనివాసరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సంక్రాంతి సంబరాన్ని తలపిస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు అన్నారు. బుధవారం పోటీలను లాంఛనంగా ప్రారంభించిన ఆయన.. కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామిరెడ్డి శ్రీనివాసరెడ్డి మెమోరియల్ పేరుతో ప్రతి ఏటా పోటీలు నిర్వహిస్తున్న రామిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులను, ఆర్గనైజర్లు చిక్కాల కిరణ్‌కుమార్, మహేంద్ర తదితరులను అభినందించారు. చిక్కాల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా క్రికెట్‌తో పాటు మరో గేమ్ నిర్వహించడం జరుగుతోందని, ఈ ఏడాది క్రికెట్‌తోపాటు నెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నెల 18న నెట్‌బాల్ పోటీలు ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరుగుతాయని, ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి హాజరవుతారని అన్నారు. ఈ పోటీలకు ఆర్థికంగానే కాకుండా అన్నివిధాలుగా రామిరెడ్డి నితిన్‌రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ జెడా వెంకటేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు అడపా రాము, నిర్వాహక కమిటీ సభ్యులు సంతోష్, కరిముల్లా, లక్ష్మణ్, చెన్నుబోయిన అశోక్, నాగరాజు, సాయిరాం పాల్గొన్నారు.

క్విస్ విద్యార్థినికి బంగారు పతకం



బంగారు పతకం సాధించిన క్విస్ విద్యార్థిని లక్ష్మీ ప్రియాంక

ఒంగోలు: సౌత్ ఇండియా బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక క్విస్ ఇంజినీరింగ్ సీఎస్‌ఐటీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని లక్ష్మీ ప్రియాంక బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు స్థానిక ప్రతిభా కాలేజీలో జరిగిన పోటీల్లో ఈ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, చైర్మన్ నిడమానూరి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావులు లక్ష్మీ ప్రియాంకను అభినందించారు.

మంచినీటి పైపులైన్ పనులు పూర్తి

- ప్రాంతాల వారీగా మంచినీటి సరఫరాలో సర్దుబాటు చర్యలు

ఒంగోలు సబర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని భాగ్యనగర్ నాలుగో లైన్‌లో హౌసింగ్ బోర్డు వెళ్లే మెయిన్ రోడ్డు వద్ద మంచినీటి ప్రధాన పైపులైన్‌కు పడిన లీకులకు మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు పూర్తి చేసినట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. అందులో భాగంగా భాగ్యనగర్ ప్రాంతంలో మంచినీటి సరఫరాకు ఒక రోజు అంతరాయం ఏర్పడింది. మరమ్మతులు పూర్తయినందున బుధవారం భాగ్యనగర్, రాంనగర్, సంతపేట, గద్దలగుంట, పోతురాజుపాలెం ప్రాంతాలకు మంచినీరు సరఫరా చేశామన్నారు. ఈ నెల 11వ తేదీ నీరివ్వాల్సిన మిగిలిన ప్రాంతాలకు 12వ తేదీ సరఫరా చేస్తామన్నారు. 12వ తేదీ ఇవ్వాల్సిన ప్రాంతాల్లో 13వ తేదీ, 13వ తేదీ ఇవ్వాల్సిన ప్రాంతాల్లో 14వ తేదీ మంచినీరు సరఫరా చేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు గమనించి నగరపాలక సంస్థ అధికారులకు సహకరించాలని కమిషనర్ కోరారు.

సీఎం జగన్‌ను కలిసిన జాలిరెడ్డి



సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న జాలిరెడ్డి

ఒంగోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలు ప్రస్తావించగా, జనవరి నెలలో డీఏ విడుదలతో పాటు ఏప్రిల్ నాటికి పీఎఫ్ బకాయిలు, తదితర సమస్యలు కూడా పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని జాలిరెడ్డి తెలిపారు. అందుకు సీఎంకు ఉపాధ్యాయుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఒంగోలు టౌన్: ఈ నెల 29, 30, 31 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుభాన్‌నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవనంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ, నిర్మాణ రంగాల తర్వాత అతిపెద్దదైన హమాలీ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

ఘనంగా ఎత్నిక్ డే సంబరాలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు: స్థానిక రైజ్ కృష్ణసాయి గ్రూప్ కాలేజీల్లో సాంస్కృతిక మరియు క్రీడోత్సవాలు (ఎత్నిక్ డే)ను బుధవారం ఘనంగా నిర్వహించారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విద్యార్థులకు ఎత్నిక్ డే నిర్వహిస్తున్నామని, విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు మాట్లాడుతూ తమ కాలేజీలో విద్యార్థులకు ఎత్నిక్ డే సందర్భంగా చిత్రలేఖనం, వ్యర్థం నుంచి అర్థవంతం, కబడ్డీ, రంగోళి పోటీలు నిర్వహించామని పేర్కొంటూ ప్రతిభ చాటిని వారికి బహుమతులిచ్చారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు కోశాధికారి భరత్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థినులు కోలాటం, ఆంధ్రాఫోక్ డ్యాన్స్ వంటి ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకోగా, వారిని రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక ప్రశంసించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన శిద్దా సూర్యకుమారి, శిద్దా పుష్పలత, శిద్దా జయశ్రీ, చైర్మన్ రంగమన్నార్ చేతుల మీదుగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

యాజమాన్యంతో ఉన్న సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న 108 సర్వీసు కాంట్రాక్టు ఎంప్లాయీస్

- నిరసన తెలిపిన 108 కాంట్రాక్టు ఉద్యోగులు

ఒంగోలు అర్బన్: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ యాజమాన్యంతో 108 సర్వీసుల్లో ఉన్న సమస్యలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రకాశం భవనం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ వాహనాల ఫిట్‌నెస్‌లు, ఇన్సూరెన్స్ వంటివి రెన్యువల్ చేయాలన్నారు. 108 వాహనాలకు గత నాలుగు నెలలుగా మెడికల్ ఇండెంట్ ఇవ్వడం లేదని, దాని వలన వాహనాల్లో అత్యవసర ఇంజక్షన్‌లు, ఇతర సామగ్రి లేని పరిస్థితులు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. మరమ్మతులు అవసరమైన వాహనాలకు వెంటనే చేయించాలని, మైలేజీ కోసం స్పీడ్ వెళ్లరాదంటూ ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. ముఖ్యంగా అంబులెన్స్ ఏదైనా ప్రమాదానికి గురైతే డ్రైవర్‌ను బాధ్యుడిని చేయడం దారుణమన్నారు. ఉద్యోగుల పరంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలం సుబ్బారావు, గాలిరెడ్డి, మస్తాన్‌వలి, భాస్కర్, కమలాకర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం రైల్వే గేటును పరిశీలించిన రైల్వే అధికారులు



మ్యాపును పరిశీలిస్తున్న రైల్వే గతి శక్తి ఇంజినీరింగ్ అధికారులు, ఒంగోలు ఎంఈ, తదితరులు

ఒంగోలు సబర్బన్: నగరంలోని అగ్రహారం రైల్వే గేటు ప్రాంతాన్ని రైల్వే గతి శక్తి ఇంజినీరింగ్ విభాగం అధికారులు బుధవారం పరిశీలించారు. రైల్వే గతి శక్తి ఇంజినీరింగ్ విభాగం ఏడీఈ ఎస్ గౌతం బృందం అగ్రహారం రైల్వే గేటు (207) ఉన్న ప్రాంతాన్ని, ఇరువైపులా అప్రోచ్ రోడ్లు వచ్చే ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరు కావడంతో పాటు గతి శక్తి రైల్వే విభాగం నుంచి రూ.11.17 కోట్లు కూడా మంజూరు చేశారు. అందులో భాగంగా నిర్మాణం చేపట్టడానికి రూపొందించిన ప్లాన్‌లను కూడా అధికారులు పరిశీలించారు. బ్రిడ్జితో పాటు రైల్వే లైన్‌కు ఇరువైపులా అప్రోచ్ ప్రాంతాలను, అక్కడున్న ఇళ్లను పరిశీలించి ఇబ్బందులు లేకుండా ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశాలను ఒంగోలు నగరపాలక సంస్థ ఎంఈ కే మాల్యాద్రిని అడిగి తెలుసుకున్నారు. ఈ అంశాలను గతి శక్తి ఉన్నతాధికారులకు నివేదించేందుకు వచ్చామని ఏడీఈఎస్ గౌతం పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, చింతపల్లి గోపీచంద్, శ్రీరాం నాగభూషణం పాల్గొన్నారు.

పేకాట, కోడి పందేల శిబిరాలపై దాడులు

కొత్తపట్నం: పేకాట, కోడి పందేల శిబిరాలపై బుధవారం పోలీసులు దాడులు చేశారు. ఈతముక్కల శివారు ప్రాంతంలో కోడి పందేలు వేస్తున్న శిబిరంపై దాడి చేసి రెండు కోళ్లు, రూ.1,250 నగదు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కొత్తపట్నం గంగమ్మ గుడిలో పేకాట ఆడుతుండగా దాడి చేసి రూ.8 వేల నగదును స్వాధీనం చేసుకుని ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై కొక్కిలగడ్డ మధుసూదన్‌రావు తెలిపారు.

పొగాకు సాగులో మెళకువలు పాటించాలి



మాట్లాడుతున్న ఒంగోలు వేలం కేంద్రం–2 నిర్వహణాధికారి రామకృష్ణ

ఒంగోలు రూరల్: పొగాకు సాగులో మెళకువలు పాటించాలని పొగాకు వేలం కేంద్రం–2 నిర్వహణాధికారి కె.రామకృష్ణ రైతులకు సూచించారు. ఒంగోలు మండలంలోని సర్వేరెడ్డిపాలెంలో బుధవారం పొగాకు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అవశేషాల నియంత్రణ, పురుగు మందుల వాడకం, సస్యరక్షణ విధానాలు, జీవ, వృక్ష సంబంధిత మందుల వాడకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పొగాకు తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పొగాకు పంటపై సిఫార్సు చేసిన పురుగు మందులను మాత్రమే అవసరాల మేరకు వాడి చివరిగా మందుల అవశేషాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఐటీసీ ప్రతినిధి ప్రశాంత్ మాట్లాడుతూ పొగ మొక్క నాటిన తర్వాత 45 రోజులకు నత్రజని ఎరువుల వాడకం వద్దన్నారు. మొక్క నాటిన 60 రోజుల తర్వాత ఎటువంటి మందులు తెగుళ్ల కోసం వాడరాదని స్పష్టం చేశారు. పీఎస్‌ఎస్‌హెచ్ తరఫున ఎ.రామాంజనేయులు మాట్లాడుతూ పొగాకు పంటల చుట్టూ ఎర్ర పంటలు, కంచె పంటలైన ఆముదం, సజ్జ, జొన్న, లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు, పసుపు రంగు పూసిన ఆముదం రేకులను అమర్చాలని, నత్రజని, పొటాషియం ఎరువులను సిఫార్సు మేరకే వాడాలని తెలిపారు. కార్యక్రమంలో పొగాకు వేలం కేంద్రం–2 యాక్షన్ సూపరింటెండెంట్ రామకృష్ణ, ఎస్‌జీవో టి.గౌతం, ఐటీసీ ప్రతినిధులు ప్రశాంత్, రామాంజనేయులు, బోర్డు సిబ్బంది, రైతులు, రైతు నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆదిశేషయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయండి

ఒంగోలు రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఏపీడీ జి.కాత్యానిదేవి సూచించారు. మండల ఎస్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో గ్రామాలవారీగా సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల గుర్తింపునకు గ్రామ సభలు నిర్వహించి ఆయా గ్రామ సర్పంచుల అధ్యక్షతన కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరించి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. లింక్ రోడ్డు, డొంక రోడ్డు, చెరువు పూడికతీత పనులు, కాలువల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీడీ కోరారు. గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ కూలీలు, మేట్లకు పనుల కేటాయింపు జరిపే అంశంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారి భార్గవి, ఏపీవో రామరాజు, టెక్నికల్ అసిస్టెంట్లు, విలేజ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత

నాగులుప్పలపాడు: తాము చదివిన పాఠశాల, ప్రస్తుతం అందులో చదువుతున్న విద్యార్థుల ఉన్నతి గురించి పూర్వ విద్యార్థులు ఆలోచించడం చాలా గర్వకారణమని అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యవతి అన్నారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి పిన్నక వెంకటేశ్వరరావు ప్రస్తుతం పాఠశాలలో చదువుతూ వివిధ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు సుమారు రూ.25 వేల విలువైన క్రీడా దుస్తులను హెచ్‌ఎం చేతుల మీదుగా అందజేశారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఒంగోలు డివిజన్

9010224456 90103 57744 90102 02762 90102 02856

Office mail : sakshiongads@gmail.com